క్లుప్తంగా

నేడు వెంకన్నకు కలశాభిషేకం



పరవాడ: మండలంలో ఈ.బోనంగి గ్రామ సమీపంలో కొండపై కొలువైన భూసమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి అష్టోత్తర కలశాభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ బుగిడి రామగోవిందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అభిషేక పూజలో పాల్గొని, స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత మానే రజని

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన మానే రజని రూ.లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

తెగిపడ్డ విద్యుత్ వైరు.. తప్పిన ప్రమాదం



సాయినగర్ కాలనీలో ఇళ్ల ముందు తెగిపడిన విద్యుత్ వైర్

సబ్బవరం: స్థానిక పంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీ 50 అడుగుల రోడ్డులో గురువారం ఉదయం విద్యుత్ వైర్ తెగిపడి పలు నివాసాల ముందు వేలాడింది. వేకువ జామున కావడం, ఇళ్లల్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించేందుకు ప్రయత్నించినా వారెవరూ స్పందించలేదని స్థానికులు ఆక్షేపించారు. ఎట్టకేలకు సీపీడబ్ల్యూ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరాను నిలిపి, విద్యుత్ వైర్లను సరిచేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాలం చెల్లిన విద్యుత్ వైర్లను తొలిగించి కొత్త లైన్లను వేయాలని విద్యుత్‌శాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు. రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతోనే ప్రమాదం తప్పిందని చెప్పున్నారు.

మేహాద్రిగెడ్డలో ఈత ప్రమాదకరం

పెందుర్తి: ప్రమాదకరమైన ఊబి, లోతు ఎక్కువ ఉన్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత చాలా ప్రమాదకరమని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో కొంత మంది యువకులు ఈతకు దిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన సీఐ సిబ్బందిని అక్కడికి పంపి యువకులను బయటకు రప్పించారు. కౌన్సెలింగ్ ఇచ్చి వారిని అక్కడి నుంచి ఇళ్లకు పంపారు. ప్రమాదాలు చెప్పి రావని.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బంది కల్గించే ఆటోలపై చర్యలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ ముఖద్వారం వద్ద, అలాగే సిటీ బస్సులకు అడ్డంగా ఆటోలను నిలిపి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఆటో స్టాండ్ డ్రైవర్లను పిలిచి ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఆటో స్టాండ్ కోసం కేటాయించిన స్థలంలో మాత్రమే ఆటోలను నిలపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు ఇతర కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. అలాగే ద్విచక్ర వాహనాలను కూడా స్టేషన్ ఆవరణలోకి అనుమతించబోమని, ప్రవేశిస్తే జరిమానా విధిస్తామని ఆర్పీఎఫ్ సీఐ వెంకటరమణ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సహకరించాలని కోరారు.

జగన్నాథస్వామి రథోత్సవానికి ఏర్పాట్లు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో కొలువైన జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవ వేడుకలు ఈనెల జూన్ 27వ తేదీ (శుక్రవారం) నుండి వచ్చే నెల జూలై 6వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వాహక అధికారిణి (ఈవో) కె. పద్మావతి తెలిపారు. ఈ వేడుకలు శుక్రవారం తొలియాత్రతో ప్రారంభమవుతాయి. రథయాత్ర అనంతరం, ఇంద్రద్యుమ్నహాలు వద్ద స్వామివారు భక్తులకు దశావతారాల్లో దర్శనమివ్వనున్నారు.

వాన రాకడ.. ప్రాణం పోకడ తెలియదని నానుడి. ప్రస్తుత సాంకేతిక యుగంలో కాస్త అటూ ఇటుగా వాటిని కనుక్కోగలుగుతున్నాం. కానీ సబ్బవరం మండల పరిధిలో కరెంట్ పోకడ.. రాకడ గురించి తెలుసుకోవడం చాలా కష్టంగా మారింది. ఏ క్షణం విద్యుత్ సరఫరా నిలిపేస్తారో.. ఎప్పుడు పునరుద్ధరిస్తారో.. ఎవరికీ తెలియదు. అంతా ఇక్కడి ప్రజల అదృష్టం మీదే ఆధారపడి ఉంటుందని చెప్పుకోవచ్చు. ఎలాంటి వాతావరణ ప్రభావం లేకపోయినా.. ఇక్కడ కరెంట్ వెతలు నిత్యకృత్యంగా మారాయి.



సబ్బవరం విద్యుత్ సబ్ స్టేషన్

ఎన్నాళ్లీ... విద్యుత్ వెతలు!

- విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు
- ఎప్పుడు కరెంట్ పోతుందో.. ఎప్పుడొస్తుందో తెలియని వైనం
- గ్రామీణ ప్రాంతాలకు సరఫరా మరింత అధ్వానం
- అధికారులు, పాలకులు దృష్టి పెట్టాలని ప్రజల మొర



రాయపుర అగ్రహారంలో చార్జింగ్ లైట్ వెలుగులో చదువుకుంటున్న విద్యార్థులు

సబ్బవరం:

వేసవిలో విద్యుత్ కష్టాలు షరా మామూలేనని సరిపెట్టుకోవచ్చు. కానీ మండల పరిధి గ్రామాలకు కాలంతో సంబంధం లేదు. నిత్యం కరెంట్ కష్టాలే..! దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యతరగతి, ఆ పైస్థాయి వర్గాల ప్రజలు ఇన్వర్టర్లు, జనరేటర్లు, రీచార్జబుల్ విద్యుత్ ఉపకరణాలతో ఈ కష్టాలకు కాస్త ఉపశమనం వెతుక్కుంటున్నారు. పేద, దిగువ మధ్య తరగతి ప్రజలు మాత్రం అప్రకటిత కరెంట్ కోతలతో నానా యాతనలు పడాల్సి వస్తోంది. పగటి సమయంతోపాటు, రాత్రుళ్లు కూడా విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతుండటంతో గ్రామాల్లో అంధకారం రాజ్యమేలుతోంది.

కూటమి ప్రభుత్వంలో 'కోతలు'

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలతో గృహ వినియోగదారులు, వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాతే విద్యుత్ కోతలు అధికమయ్యాయని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సబ్బవరం సెక్షన్-1, 2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన విద్యుత్ లైన్లతో పాటు, పలు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నా.. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా కావట్లేదు.

వారంలో రెండు మూడు రోజులు..

ఇటీవల రాంపురం సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిలిచిపోయింది. రాత్రి 7 వరకు అదే పరిస్థితి. అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు రాత్రి 9 గంటలకు గానీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. నాయనమ్మపాలెం సమీపంలో విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని గుర్తించడంలో విఫలం కావడంతో పాటు రాయపుర అగ్రహారం సమీపంలోని ఏబీ స్విచ్ సరిగా పనిచేయక అర్ధరాత్రి 12 వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, తెలుకులపాలెం వంటి గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి. వారం రోజుల్లో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి.

విలీనం తర్వాతే అధ్వానం!

మండలంలోని సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. గతంలో సబ్బవరం ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆర్ఈసీఎస్ పరిధిలో ఉండేది. అప్పట్లో మండలంలోని సబ్ స్టేషన్లకు పెందుర్తి లైన్‌తోపాటు, కశింకోట నుంచి ఇన్‌కమింగ్ ఉండేది. ఒక లైన్ ఆగినా, మరో లైన్ ద్వారా ప్రత్యామ్నాయ సరఫరా జరిగేది. ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌లో విలీనం చేశాక కశింకోట ఇన్‌కమింగ్ లైన్ కట్ అయింది. మరోవైపు సబ్బవరంలోని చిన్నయ్యపాలెం సమీపం టిరకాన్ లే అవుట్ నుంచి సబ్బవరం సబ్‌స్టేషన్లకు వచ్చే 33 కేవీ లైన్‌కు కాలం చెల్లిందన్న ఆరోపణలున్నాయి. గతంలో వేసిన పింగాణి ఇన్సులేటర్స్, పాలిమార్ ఇన్సులేటర్స్ కూడా పాతపడ్డాయి. దీంతో ఏ చిన్న సమస్య తలెత్తినా.. సరఫరా పునరుద్ధరణ ఎప్పుడన్నది చెప్పలేకపోతున్నారు.

ఎప్పుడొస్తుందో తెలియదు!



మండలంలో గత రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మళ్లీ గురువారం ఉదయం 11 గంటల తర్వాతే కరెంట్ వచ్చింది. నెల రోజులగా తరుచూ విద్యుత్ సరఫరా ఆపేస్తున్నారు. కారణాలేంటో చెప్పట్లేదు. కరెంట్ పోతే ఎప్పుడు వస్తుందో, అస్సలు వస్తుందో.. రాదో కూడా తియట్లేదు.

–పిల్లల అప్పలనాయుడు, రాయపుర అగ్రహారం,సబ్బవరం మండలం.

తరచూ కరెంట్ పోతోంది



ఇటీవల తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. సరఫణా ఆగిపోతే ఎప్పుడు వస్తుందో తెలియట్లేదు. వర్షాకాలం ప్రారంభమయింది. వేసవిలోనే ఇలా ఉంటే.. ఇక ముందు ముందు ఎలా ఉంటుందోనని ఆందోళన కలిగిస్తోంది. నిరంతర విద్యుత్ సరఫరాపై అధికారులు దృష్టి సారించి, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ఉప్పలి దుర్గారావు, గుల్లేపల్లి గ్రామం

నిరంతర సరఫరాకు చర్యలు

విద్యుత్ లైన్లలో పిన్‌లు పోవడంతో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఇటీవల వర్షాలు కురవడంతో ఆ మార్పులకు పిన్‌లు, కండక్టర్‌లు దెబ్బతిన్నాయి. 33 కేవీ లైన్లలో ఈ సమస్య తలెత్తుతుండటంతో ఎక్కువ ప్రాంతాల్లో ఆ ప్రభావం కనిపిస్తోంది. సమస్యను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరించి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

– అశోక్, ఏఈ, ఈపీడీసీఎల్, సబ్బవరం సెక్షన్-1

'యువత మత్తుకు దూరంగా ఉంటేనే బంగారు భవిత'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారంలో విద్యార్థులు

సబ్బవరం: దేశంలో జరిగే అనేక అనర్థాలకు మత్తు పదార్థాలు సేవించడమే కారణమని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రతిభా విద్యాలయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. డ్రగ్స్ రహిత దిశగా దేశాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన మహోత్తరమైన ఉద్యమంగా నషా ముక్త్ భారత్‌ను పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు త్వరగా ఆకర్షితులయ్యే ప్రమాదం అధికంగా ఉండటంతో, అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం ద్వారా మనుషులు విచక్షణ కోల్పోయి ఆరాచక శక్తులుగా మారే ప్రమాదముందన్నారు. ఎక్సైజ్ డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 74 గంజాయి కేసుల్లో 273 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.2.46 కోట్లు విలువ చేసే 4,340 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీగా వెళ్లి, మానవహారం నిర్వహించి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, సబ్బవరం, పరవాడ మండలాల ప్రత్యేక అధికారులు రమామణి, సరోజిని, ఎంపీడీవోలు పద్మజ, రమేష్‌నాయుడు, సీఐలు జి.రామచంద్రరావు, తహసీల్దార్ చిన్నికృష్ణ, ప్రతిభా కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

'జూలై 9 సమ్మెను విజయవంతం చేయండి'



ఎన్టీపీసీ వద్ద కరపత్రాలను పంపిణీ చేస్తున్న గనిశెట్టి

పరవాడ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్‌తో జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ మెయిన్‌గేట్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేసి, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించాలన్నారు. సమాన పనికి సమాన వేతన చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులకు 8 గంటల పని వేళల్ని 12 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పాలకుల విధానాలను వ్యతిరేకించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి, అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పైల పోతినాయుడు, పి.గోవిందరాజు, పైల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు



కళాశాల ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పరవాడ: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఈవో ఎ.శ్యామలకుమారి, సభ్యులు ఎం.ఎస్.కె.సరిత, యశోద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ ఈసెట్ ఫస్ట్ ర్యాంకర్ సునీల్‌కు ఘన సత్కారం



సునీల్‌ను సత్కరిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో శ్రీనివాసరావు, ఎంపీపీ నాగమణి

పెందుర్తి: ఏపీ పీజీఈసెట్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన పెందుర్తి మండలం ఎస్ఆర్ పురం విద్యార్థి బలిబాని సునీల్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మధుపాడ నాగమణి అంజి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సునీల్‌ను జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు దుశ్శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఎంపీపీ చేతుల మీదుగా భవిష్యత్ చదువుల కోసం కొంత నగదును బహుమతిగా అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవి కనకరాజు, నాయకులు మధుపాడ అంజి, ఉప్పిలి కనకరాజు, ఎంపీడీవో అప్పలరాజు, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఏవో కొల్లి వెంకట్రావు, ఎస్ఆర్ పురం గ్రామ పెద్దలు, ప్రజలు, పలువురు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు.

గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు

ఆరిలోవ: ఈ ఏడాది జూలై 10 వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు తెలిపారు. వర్షాకాలం కావడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా గురువారం నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలో గొర్రెలు, మేకలు పెంచుతున్న రైతులు వాటికి నట్టల నివారణ టీకాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ టీకాలు వేయిస్తుండాలన్నారు. గొర్రెలు, మేకలు పచ్చిక మేసే సమయంలో పొట్టలో పురుగులు చేరుతాయని, వాటి వల్ల రక్తహీనత కలిగి నీరసిస్తాయని చెప్పారు. అలాంటి వ్యాధుల నుంచి రక్షణకు నట్టల నివారణ మందు వేస్తున్నామన్నారు. జిల్లాలో 42,000 గొర్రెలు, 26,000 మేకలున్నాయని వెల్లడించారు. వాటన్నింటికి సరిపడేలా మందులు సిద్ధం చేశామని, అన్ని పశువుల ఆస్పత్రుల్లో వీటిని అందుబాటులో ఉంచామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజశేఖర్, ఏడీ డాక్టర్ ఎం.ప్రసాదరావు, వెటర్నరీ వైద్యురాలు సుజాత పాల్గొన్నారు.

పెదగాడి జనచైతన్య లేఅవుట్‌పై సమగ్ర విచారణ

- ప్లాట్ల యజమానులకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే పంచకర్ల



పంచకర్లకు సమస్య వివరిస్తున్న పెదగాడి జనచైతన్య లేఅవుట్ ప్లాట్ల యజమానులు

పెందుర్తి: మండలంలోని పెదగాడిలో ఉన్న జనచైతన్య లేఅవుట్‌లో దాదాపు 30 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలుచేసిన యజమానులను ప్రస్తుతం ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని సీఐ కె.వి.సతీష్‌కుమార్‌కు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. ఈ లేఅవుట్‌లోని వందలాది ప్లాట్లు తమ తాతలు, తండ్రులవని చెప్తూ కొందరు జనసేన నాయకులు యజమానులను ఇబ్బందులకు గురిచేస్తూ దురాక్రమణకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించేందుకు ప్లాట్ల యజమానులు గురువారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. పెదగాడిలోని జనసేన నాయకుల నుంచి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పెదగాడిలో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఐకి సూచించారు.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం.. రూ.10 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన సామగ్రిని చూపిస్తున్న బాధితులు పైడమ్మ, కోటేశ్వరరావు



బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం శివారు తమ్మయ్యపాలెంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టంతో పాటు పట్టాదార్ పాస్ పుస్తకాలు వంటి విలువైన డాక్యుమెంట్లు కాలిబూడిదయ్యాయి. అధికారులు, బాధితులు తెలిపిన వివరాలు..

గ్రామానికి చెందిన జోగ పైడమ్మ, కోటేశ్వరరావు దంపతులు వ్యవసాయంతో పాటు, కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుమారుడు భార్యతో కలిసి ఇంట్లోని కింది పోర్షన్‌లో ఉండగా, బాధిత దంపతులు మేడపైన షెడ్‌లో ఉంటున్నారు. వ్యాపారం కోసం గాజువాక వెళ్లాల్సి ఉండగా గురువారం ఉదయం పైడమ్మ టీ కాచేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఆమె బయటకు పరుగులు తీసింది. విషయం కొడుకు, కోడలికి తెలియడంతో, వారు పైకొచ్చేసరికి మంటలు పూర్తిగా వ్యాపించి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదంలో మనవరాలికి సారె పెట్టేందుకు తెచ్చి ఉంచిన రూ.4 లక్షల నగదు, 4 తులాల బంగారు అభరణాలు, 20 బస్తాలు ధాన్యం, 10 కోళ్లు, 150 కిలోల బొబ్బర్లు, మినుములు, గృహోపకరణాలు, దుస్తులు, డాక్యుమెంట్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.10 లక్షల వరకూ ఆస్తినష్టం వాటిల్లింది. మనవరాలికి సారె పెట్టేందుకు మూడు రోజుల క్రితమూ బంగారు అభరణాలు, నగదు బ్యాంకు నుంచి తెచ్చి ఇంట్లోని ట్రంక్ పెట్టెలో పెట్టినట్లు బాధితులు రోదిస్తూ చెప్పారు. కూరగాయల వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటూ రూపాయి రూపాయి పోగుచేసుకున్న సొమ్ము బుగ్గిపాలైందని పైడమ్మ బోరున విలపించింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ చిన్నికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను సేకరించారు. బాధితులకు బియ్యం, దుస్తులు వంటి నిత్యావసర సరకులు అందించారు. ప్రమాదంపై కలెక్టర్‌కు నివేదిక అందించి, ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు వంటి కాలిపోయిన డాక్యుమెంట్లు పునరుద్ధరించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వీఆర్వో డి.దేముడు బాబు, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, గ్రామ పెద్దలు ఉన్నారు.